హైదరాబాద్ వార్త



మక్కామసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



# మెట్రోకు.. కిక్కిరిసిన జనం



హైదరాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఎండల తీవ్రత పెరగడంతో మెట్రోకు నగరవాసులు క్యూ కడుతున్నారు. ఆ రద్దీని చూస్తుంటే ముంబై మెట్రోను తలపిస్తోంది. శుక్రవారం నగరంలోని అన్ని మెట్రో స్టేషన్లలో రద్దీ ఏర్పడింది. కొద్ది రోజులుగా ఎండలు భగ్గుమంటున్నాయి. రోడ్లపై ప్రయాణం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. దీంతో నగరవాసులు సొంత వాహనాలను పక్కన పెట్టారు. ఆర్టీసి బస్సుల్లోనూ ప్రయాణించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎండాకాలం కావడంతో చల్లగా మెట్రో వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో రద్దీ అనూహ్యంగా పెరిగిపోయింది. దీంతో కొద్ది రోజులుగా మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఉదయం 8 గంటల నుంచే మెట్రో రైళ్లలో రద్దీ కనిపించింది. నాగోల్ నుంచి అమీర్‌పేట వరకు అక్కడి నుంచి రాయదుర్గం వరకు అన్ని ప్రధాన స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. అలాగే ఎల్బీనగర్ నుంచి అమీర్‌పేట మీదుగా మియాపూర్ వరకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. మెట్రో స్టేషన్లు ఫుల్ అయ్యి, మెట్లపై వరకు ప్రయాణికులు నిల్చున్నారు. శుక్రవారం కూడా సుమారు ఐదు లక్షల మంది ప్రయాణికులు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగించినట్లు సమాచారం. మెట్రో సర్వీసుల సంఖ్య పెంచాలంటూ ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. నగరంలోని మూడు కారిడార్లలో ప్రస్తుతం ప్రతి రోజు సుమారు వెయ్యి ట్రిప్పులు తిరుగుతున్నట్లు అంచనా. ప్రస్తుతం ప్రతి మూడు నుంచి ఐదు నిమిషాలకో రైలు చొప్పున నడుస్తున్నాయి. కానీ రద్దీ ఎక్కువగా ఉండే నాగోల్–రాయదుర్గం రూట్‌లో ఐదు నిమిషాల వ్యవధిలోనే ప్రయాణికులు వెల్లువలా వచ్చేస్తున్నారు. ఎల్బీనగర్–మియాపూర్ మార్గంలోనూ ఇదే పరిస్థితి. రైళ్ల వేగాన్ని పెంచి ప్రతి రెండు నిమిషాలకు ఒక మెట్రో అందుబాటులో ఉండేలా నడిపితేనే మరిన్ని ట్రిప్పులు పెరిగి ప్రయాణికులకు ఈ వేసవిలో ఊరట లభించే అవకాశం ఉంది.

## కంటోన్మెంట్ రోడ్ల మూసి వేతకు తెరపడింది

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రోడ్ల మూసి వేతను విరమించుకోవాలని శుక్రవారం కేంద్ర రక్షణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. సికింద్రాబాద్‌లోని ఐదు రోడ్లకు ప్రజల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా మూసిన రోడ్లను తెరిచి ఉంచాలని వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థ అభిప్రాయాల మేరకు కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో తీర్మాణం చేసింది. మూసి వేసిన రోడ్లను తిరిగి ఓపెన్ చేయాలని రక్షణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కంటోన్మెంట్ ప్రజల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై 12 రోడ్లను తక్షణమే తెరువాలి ్ందని, మరో 7 రోడ్లను యధాస్థితిని కొనసాగించాలని సూచించింది. రక్షణ శాఖ ఆదేశాలతో కంటోన్మెంట్‌లోని ప్రొటీని రోడ్డు, బ్యామ్ రోడ్డు, రిచార్డ్‌సన్ రోడ్డు, అమ్ముగూడరోడ్డు, లక్డావాలా రోడ్డు, ఆల్‌బేయిన్ రోడ్లను తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది.

### రంజాన్ తోఫాలను అందజేసిన జె.ఎం. ఆర్

అడ్డగుట్ట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ఏప్రిల్ 21 ప్రభాతవార్త: రంజాన్ పర్వది నాన్ని పురస్కరించుకొని బోయిన్‌పల్లిలోని ముస్లిం మహిళలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, సమీర్ పాల్గొన్నారు.

# నేడే ఈదుల్ ఫితర్



చార్మినార్ పరిసర ప్రాంతాలలోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసి పోయినప్పటి చిత్రం



చార్మినార్ నుంచి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న సిపి సి.వి.ఆనంద్

చార్మినార్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఆకాశంలో నెలవంక కనిపించటంతో ముస్లింలు ఈ నెల 22వ తేదీ శనివారం రోజున ఈదుల్ ఫితర్ (రంజాన్ పండుగ)ను అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకోనున్నారు. మార్చి నెల ఇరవై నాలుగువ తేదీన పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం అయ్యింది. నెల రోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు నిర్వహించారు. ప్రతీ రోజు సాయంత్రం ఉపవాస దీక్షలు విడిచి పెట్టిన అనంతరం ముస్లింలు ఇఫ్తార్ విందులలో పాల్గొంటున్నారు. కాగా శుక్రవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించటంతో ముస్లింలు శనివారం ఈదుల్ ఫితర్ (రంజాన్ పండుగ)ను జరుపుకోనున్నారు. ముస్లింలు ఒకరికి ఒకరూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు. కాగా రంజాన్ మాసం చివరి రోజు కావటంతో శుక్రవారం చార్మినార్ పరిసర ప్రాంతాలలోని నైట్ బజార్‌లో వేలాది మంది ప్రజలు వస్తువులు కొనుగోలు చేయటానికి తరలి రావటంతో మార్కెట్లన్నీ కిక్కిరిసిపోయాయి. పాతబస్తీలోని మీరాలం చారిత్రక ఈద్గా, చార్మినార్ సమీపంలోని మక్కామసీదులో శనివారం ఉదయం వేలాది మంది ముస్లింలు సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు. చారిత్రక మీరాలం ఈద్గాలో శని వారం వేలాది మంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేయటానికి వస్తున్నందున వక్ఫ్‌బోర్డు, వాటర్ వర్క్స్, విద్యుత్, జిహెచ్ఎంసి, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు పాతబస్తీలోని అన్ని ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా జుమ్మాతుల్ విదా సందర్భంగా శుక్రవారం చారిత్రక మక్కామసీదులో పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్దనలు జరిపారు. మక్కామసీదులో జరిగిన ప్రార్దనలలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, మోజం ఖాన్, కౌసర్ మోహియుద్దీన్, జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా హుస్సేన్ ఉల్ హుస్సేనీ ఎఫాందీ, మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. కాగా నగర్ పోలీస్ కమిషనర్ శుక్రవారం హైదరాబాద్ పాత బస్తీని సందర్శించారు. చార్మినార్ నుంచి ఆయన పోలీస్ ఉన్నతా ధికారులతో కలిసి శాంతి భద్రతల ను పర్య వేక్షించారు. దక్షిణ మండలం డిసిపి సాయిచైతన్య పోలీస్ ఉన్నతాధికారులు సిపి సి.వి. ఆనంద్ వెంట ఉన్నారు.

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్‌తోనే సాధ్యం

### మంత్రులు తలసాని, మల్లారెడ్డి





బోయిన్‌పల్లిలో బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇన్‌చార్జిలు దాసోజు శ్రావన్, మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్‌తోనే సాధ్యం అవుతుందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమలు, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్మిక మంత్రి చామకూర మల్లారెడ్డిలు పిలుపునిచ్చారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కంటోన్మెంట్ 1వ వార్డు బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే కంటోన్మెంట్ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయన్నారు. అదే విధంగా రోజు విడిచి రోజు ఉచిత మంచినీరు అందజేస్తున్నామన్నారు. అదే విధంగా పేదప్రజలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వ డం జరిగిందన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా 1200 కోట్ల వ్యయంతో మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్, కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించాలన్నారు. టీపిసిసి అధ్యక్షుడు, మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఒక్కసారి కూడా పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్న దాఖలాలు లేవన్నారు. అటువంటి వ్యక్తులకు, ఆ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రావన్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ రంగ సంస్థ చైర్మన్లు మన్నె క్రిషాంక్, గజ్జెల నాగేశ్‌లు మాట్లాడుతూ ముఖ్య మంత్రి కేసిఆర్ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడాలేని విధంగా అమలౌతున్నాయన్నారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మభ్యపెడుతున్న బిజెపి కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వరీరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, నళిని కిరణ్, లోకనాధం, భాగ్యశ్రీ, మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు ముప్పిడి మధుకర్, ప్రభుగుప్త, పిట్ల నాగేశ్ పాల్గొన్నారు.

# పెళ్లిగోల.. మాయలీల

### నగరంలో పెట్రేగుతున్న నకిలీ మ్యాట్రిమోనీలు

### పెళ్లిళ్ల పేరుతో లక్షలు దోచేస్తున్న కేటుగాళ్లు

### అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: మూడు పదులు దాటిన వయస్సు.. ముదురు బెండకాయ అంటూ బంధుగణం విమర్శలు.. నచ్చిన సంబంధం కోసం నానా తంటాలు.. ఏదో ఒక పెళ్లి సంబంధం ఖాయం చేసుకుందామనే ఆలోచనతో ఆన్‌లైన్‌లో వెతుకులాట.. అందమైన వదువు ఉందనే ప్రకటన కనిపించగానే పరుగెత్తుకుంటూ వెళ్లడం. బ్రహ్మచారుల పెళ్లిపాట్లను పసిగట్టిన మాయగాళ్లు సరికొత్త మోసాలకు శ్రీకారం చుట్టారు. చేతికి అందినంత లాగేసి వదిలేస్తున్నారు. అమాయకులకు వల విసిరేందుకు ప్రకటనలు, సోషల్‌మీడియా వేదికలుగా మారాయి. వీరి వలలో చిక్కి సొమ్ముపోగొట్టుకున్న బాధితుల్లో ఎక్కువగా సంపన్న వర్గాలకు చెందినవారు విద్యావంతులే ఉంటున్నారు. ఇటీవల మ్యారేజ్ బ్యూరోల చేతిలో మోసపోయి చాలామంది పోలీసులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు వసూలు చేయడమే టార్గెట్‌గా కేటుగాళ్లు మ్యాట్రిమోనీల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకు భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటూ, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు బాగా డబ్బున్న వారిని ఎంచుకుంటున్నారు. వారి అమాయకత్వాన్ని ఒంటరి తనాన్ని ఆసరాగా చేసుకుంటున్నారు. మీకు మేమున్నాం అని భరోసా కల్పించి ఒంటరి జీవితంలో ఆశలు రేకెత్తిస్తున్నారు. మాయ మాటలతో మచ్చిక చేసుకుని, వారి బలహీనతను అడ్డంపెట్టుకుని, వివిధ రకాల కారణాలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. ఆతర్వాత ముఖం చాటేసి అడ్రస్‌లేకుండా పోతున్నారు. తాము మోసపోయామని గ్రహించిన కొందరు పోలీసులు, కోర్టులు, కేసులు అంటూ తిరిగి సమాజంలో పలుచన కావడం ఇష్టం లేక మిన్నుండిపోతున్నారు.

**పెళ్లి చూపులా మజాకా..** ఆన్‌లైన్‌లో ప్రకటనలు చూసి మ్యారేజ్ బ్యూరోలకు వెల్లడమే ఆలస్యం.. రిజిస్ట్రేషన్ పేరుతో రూ.2000 నుండి 5000వేల వరకు వసూలు చేస్తారు. రిజిస్ట్రేషన్ తంతు ముగియగానే పెళ్లిచూపుల నాటకం ప్రారంభిస్తారు. తమ వద్ద పనిచేసే టెలికాలర్స్, రోజువారి జీతానికి ఏర్పాటు చేసిన విద్యార్థినులతో తమ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఫోన్‌లు చేయిస్తారు. నవ్వుతూ మాట్లాడిస్తారు. అవతలి వ్యక్తుల ఆస్తిపాస్తులు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలు సేకరిస్తారు. పార్కులు హోటళ్లలో పెళ్లిచూపులంటూ పిలిపించి ఇద్దరినీ ఒకేచోట చేర్చుతారు. ఆఅమ్మాయిలతో పుట్టినరోజు డ్రామా ప్రారంభిస్తారు. చీరలు నగలు, బహుమతులు గుంజుతారు. ఏకాంతంగా ఉన్నఫోటోలు తీస్తారు, మాయనాటకం ముగిశాక బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు. ఇటీవల అమీర్‌పేట్‌లో హాస్టల్లో ఉంటూ బుద్దిగా చదువుకునే ఓయువకుడు ప్రకటన చూసి మ్యారేజ్ బ్యూరోను ఆశ్రయించాడు. పేరునమోదు చేసుకుని వారం రోజులతర్వాత కూకట్‌పెళ్లిలోని ఓహోటళ్లో పెళ్లి చూపులు ఏర్పాటు చేశారు. నలభై ఏళ్లమహిళలకు మేకప్ వేసి అతడికి పరిచయం చేశారు. యువకుడు ఆమె తనకు నచ్చలేదని చెప్పడంతో నానా గొడవ చేశారు. పరువుపోతుందని భయపడిన ఆయువకుడు తన మెడలో ఉన్న బంగారు గొలుసు ఇచ్చి బయటపడాల్సి వచ్చింది.

**మ్యాట్రిమోని ప్రకటనలతో నిత్యపెళ్లికొడుకు..**
మ్యాట్రిమోని ద్వారా ప్రకటనలు ఇస్తూ మహిళలను పరిచయం చేసుకుని ఒకరికి తెలియకుండా మరరొక్కరిని ఏకంగా మూడు పెళ్ళిల్లు చేసుకుని మరో మహిళలను మోసం చేసిన అప్పలరాజు అలియాస్ విజయ్ బాగోతం తాజాగా భయటపడింది. బాదితురాలు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడలోని అయోధ్యనగర్ కాలనీలో నివాస ముంటున్న అప్పలరాజు అలియాస్ విజయ్ ఓఫార్మా కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి సంతానం కలగలేదు. మ్యాటిమోని, పత్రికల్లో ప్రకటనలు ఇస్తూ మహిళలను మోసం చేస్తూ ఇప్పటికే మూడు పెళ్లిళ్ల చేసుకున్నాడు. తనను పెళ్ళి చేసుకుని మోసం చేసినట్లు బాధితురాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. విషయం తెలిసి సదరు మహిళ అప్పలరాజును నిలదీసింది. చెప్పాపెట్టకుండా ఇళ్లు ఖాళీ చేస్తున్న విసం తెలుసుకుని మహిళా సంఘాల నాయకులతో అప్పలరాజు ఇంటి ఎందుట నిరసనకు దిగింది.

**అండగా ఉంటానని..** సైబరాబాద్ ప్రాంతానికి చెందిన ఓమహిళ 2017లో విడాకులు తీసుకుంది. మరో వివాహం కోసం మాట్రిమెనీ సైట్‌లో ప్రొఫైల్‌లో అప్‌లోడ్ చేసింది. ఓవ్యక్తి ఫోన్‌చేసి ఆమెతో పరిచయం చేసుకున్నాడు. రోజూ ఫోన్లు, వాట్సాప్ మెసేజ్‌లు చేసుకునే వారు. కొద్దిరోజుల తర్వాత పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. ఆమె సరేనంది. ఇందుకోసమే వేచి చూసిన ఆతగాడు ఓరోజు వ్యాపారంలో నష్టపోయానని కొంత ఆర్థిక సాయం చేస్తే వ్యాపారం పుంజుకుంటుందని నమ్మించాడు. కాబోయే భర్తే అని భావించిన ఆమె రూ.5లక్షలు అతని అకౌంట్‌లో జమ చేసింది. ఆతర్వాత వివిధ కారణాలు చెప్పి రూ.11లక్షలు తన అకౌంట్‌లు వేయించుకున్నాడు. రానురాను అతని మాటతీరు, ప్రవర్తనలో మార్పురావడంతో ఆమె డబ్బుల గురించి అడిగింది. అప్పటివరకు ఏదో చెప్పిన మాయగాడు తర్వాత ఫోన్ స్విఛ్ఛాఫ్ చేశాడు. మోసపోయానని గ్రహించిన మహిళ పోలీసులును ఆశ్రయించింది.

## మహిళ హత్య

### నిందితుల కోసం క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్లతో గాలింపు

నిజాంపేట్, ఏప్రిల్21 ప్రభాతవార్త: అత్యాచార యత్నానికి ప్రయత్నించి విఫలమవడంతో మహిళను చున్నితో ఉరివేసి హతమార్చిన సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కు చెందినకుమార్(22) అనే యువకుడు బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్ రుచి హోటల్లో పని చేసుకుంటూ అక్కడే నివాసం ఉంటున్నాడు. అయితే గురువారం రాత్రి కుమార్, అతని స్నేహితుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పార్సిల్ తీసుకొని కుమార్ ఇంటికి వెళ్తున్న సమయంలో బాలానగర్‌కు చెందిన పూజిత(45) అనే మహిళ ఓ పని నిమిత్తం ఇందిరానగర్ చేరుకుంది. ఈ క్రమంలో కుమార్, అతని స్నేహితుడు పూజితను మాయా మాటలతో లొంగదీసుకొని కుమార్ గదికి తీసుకు వెళ్ళి అత్యాచార యత్నానికి ప్రయత్నించారు. పూజిత అందుకు నిరాకరించి ప్రతిఘటించడంతో కుమార్, అతని స్నేహితుడు ఆమెను చున్నీ గొంతుకు బిగించి హత్యచేసి పరారయ్యారు. మరుసటి రోజు ఉదయం హోటల్ యజమాని కుమార్ హోటల్‌కు రాకపోవడంతో అతని గదికి వెళ్ళి చూడగా పూజిత విగతజీవిగా పడి ఉండడంతో బాచుపల్లి పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌తో నిందితుల కోసం గాలిస్తున్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



మహనీయుల జయంతి వేడుకల్లో పాల్గొన్న వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్

తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ప్రపంచం ముందు భారత్‌ను తలెత్తుకొని నిలబడేందుకు అవకాశం కల్పించిన డా. బీఆర్ అంబేద్కర్ దార్శనికతను ప్రతి ఒక్కరు ఆచరణలో పాటించాలని ఓ.యూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఓ.యూ ఎస్సీ, ఎస్టీసెల్, బీసీసెల్, మైనార్టీ సెల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఓ.యూలో నిర్వహించిన మహనీయుల జయంతి వేడుకలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిసాయి. ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ ముగింపు వేడుకలకు విసి రవీందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఓ.యూలో జరుగుతున్న పరిపాలనా, అకడమిక్, పరిశోధనల్లో వచ్చిన మార్పులను ఆయన వివరించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.మల్లేశం మాట్లాడుతూ మహనీయుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. వారి త్యాగాలను ఎల్లప్పుడు స్మరించుకోవాలన్నారు. ఎక్కడ లేని విధంగా 15 రోజుల పాటు మహనీయుల జయంతి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన కళాకారులు, విధ్యార్థులచే నిర్వహించిన వివిద సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పలు నృత్యాలు, స్కిట్‌లు, సంగీత వాయిద్యాలతో ఠాగూర్ ఆడిటోరియం మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ ప్రొ.బి.మంగునాయక్, బీసీ సెల్ డైరెక్టర్ ప్రొ.చలమల్ల వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ డైరెక్టర్ గా.సయ్యదా అజీమ్ ఉన్నీసా, డైరెక్టర్ డా.కొండానాగేశ్వర్ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ముస్లింలు హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాలి

### ఎంపి అసదుద్దీన్ ఓవైసీ



మక్కామసీదులో జరిగిన యౌముల్ ఖురాన్ పఠనం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

చార్మినార్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : అన్ని విధాల వెనుక బడిన ముస్లింలు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంఐఎం అధినేత హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం రోజున చారిత్రక మక్కామసీదులో జరిగిన యౌముల్ ఖురాన్ పఠనం కార్యక్రమంలో ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ముస్లింలపై రోజు, రోజుకు దాడులు పెరిగి పోతున్నాయని తెలిపారు. ఇటీవల యుపిలో పోలీసులు సమక్షంలోనే ఇద్దరు ముస్లింలను కాల్చివేశారని ఆయన తెలియజేశారు. రంజాన్ మాసం ప్రాముఖ్యత గురించి ఎంపి అసదుద్దీన్ ఓవైసీ వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాంధీనగర్ డివిజన్‌లో రంజాన్ వేడుకలు

ధర్నాచౌక్, ఏప్రిల్21, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్‌లో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సబర్మతినగర్ బస్తీలోని మజీద్ ఈ సుభాని వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు గాంధీనగర్ కార్పోరేటర్ పావని వినయ్‌కుమార్, బీజేపీ నగర నాయకులు ఏ.వినయ్‌కుమార్ హాజరయ్యారు. బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర నాయకులు మహమూద్‌కు, మజీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్ మహమూద్ లకు ఖర్జూరాలు తిపిపించి ఉపవాస దీక్ష విరమింపచేశారు. స్థానిక డివిజన్ అధ్యక్షులు రత్నసాయిచంద్, బీజేపీ నేతలు శ్రీకాంత్, వీఎస్టీ రాజు, ఎం.ఉమేష్, రహేమత్ ఆలీ, బండారి భరత్, లక్ష్మణ్‌యాదవ్, సత్యం, సురేష్ పాల్గొన్నారు.


### రిపోర్టర్లు కావలెను

'వార్త' తెలుగు జాతీయ దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.
ఏదైనా డిగ్రీ అర్హతతో తెలుగు భాషపై మంచి పట్టు ఉండి,
స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన వారు అర్హులు.
ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.

| | | |
|---|---|---|
| 1. పంజాగుట్ట | 2. బంజారాహిల్స్ | 3. జూబ్లీహిల్స్ |
| 4. మాదాపూర్ | 5. రాజేంద్రనగర్ | 6. సుల్తాన్‌బజార్ |
| 7. ముషీరాబాద్ | 8. నారాయణగూడ | 9. కార్వాన్ |
| 10. అంబర్‌పేట | 11. మౌలాలి | 12. నల్లకుంట |
| 13. నాచారం | 14. బోయిన్‌పల్లి | 15. చర్లపల్లి |
| 16. పీర్జాదిగూడ | 17. గోల్కొండ | |

దరఖాస్తులు పంపవలసిన చిరునామా
హెచ్ఆర్ మేనేజర్
'వార్త' జాతీయ తెలుగు దినపత్రిక
# 396, లోయర్ టాంక్ బండ్, హైదరాబాద్.

## రంజాన్ పండుగకు ఏర్పాట్లు

ఖైరతాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ముస్లిం సోదరులు అత్యంత వైభవోపేతంగా జరుపుకునే రంజాన్ పండుగకు అంతా సిద్ధం అయ్యారు. వారి ఇంట, మసీదుల వద్ద ప్రార్థనలు నిర్వహించే ప్రాంతాలలో సర్వం సిద్ధం చేసుకున్నారు. 30 రోజుల పాటు ఉప వాసంలో ఉన్న ముస్లిం సోదరులు, సోదరీమణులు వారి కుటుంబ సభ్యులు రంజాన్ వేడుక సందర్భంగా ఉపవాస దీక్ష వదల నున్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ పెద్ద పండుగ. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఇలా అందరూ ఎలాంటి భేదాభిప్రాయం లేకుండా ఇతరులతో మమేకమై.. వారందరిని ఆలింగనం చేసుకోవడం అనావాయితీ.

## పేద ముస్లింలకు నిత్యావసరాలు పంపిణీ



పేద ముస్లింలకు నిత్యావసర సరుకుల కెవిఆర్‌కిట్‌ను అందజేస్తున్న డా. కె.వి.రమణాచారి, భరత్, ఖాజా, మూర్తి తదితరులు

నాంపల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : అన్ని మతాలు అందరి సంస్కృతి, సంప్రదాయలను గౌరవిస్తూ అంతా కలసిమెలసి పండుగలు, వేడుకలను ఆనందోత్సాహాలు, సుఖసంతోషాలతో జరుపుకోవాలన్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి సూచించారు. సమాజంలో ప్రతీఒక్కరూ తమకున్న దానిలో ఎంతోకొంత ఇతరులకిచ్చి దాతృత్వం, మానవత్వం చాటుకోవాలని కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతీనెలా కులమతాలకు అతీతంగా అన్నివర్గాల పేదలకు నిత్యావసర సరుకుల కెవిఆర్‌కిట్‌లను పంపిణీ చేస్తున్నట్లు రంజాన్ పండుగను పురస్కరించుకొని రెడ్‌హిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డా. కె.వి.రమణాచారి సంఘసేవకులు భరత్, భోగరాజు మూర్తిల సౌజన్యంతో, పాత్రికేయుడు ఖాజా అఫ్రిది, లక్ష్మణాచారి తదితరుల సహకారంతో 75మంది ముస్లింలకు రంజాన్ పండుగను దృష్టిలో పెట్టుకొని కనీసం వారంరోజులకైనా సరిపడే నిత్యావసర సరుకుల కెవిఆర్ కిట్‌ను పంపిణీచేసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## బాలంరాయిలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



కరాటేలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: సికింద్రాబాద్, బాలంరాయి యునోఫైటర్స్‌త్వైకాండో అకాడమీ మాస్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం త్వైకాండో బెల్ట్ గ్రేడింగ్ పరిక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ త్వైకాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏ.కిషోర్‌కు మార్, కోచ్ రవికిరణ్, సంతోష్, జంపన రిషీత్ ఎల్లోవన్ బెల్ట్ సాధించాడు.

## నల్లకుంటలో కార్పొరేటర్ పాదయాత్ర



అధికారులతో మాట్లాడుతున్న కార్పోరేటర్

హైదరాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: నల్లకుంట డివిజన్‌లోని తిలక్‌నగర్ పరిసర ప్రాంతాలలో స్థానిక కార్పోరేటర్ అమృత శుక్రవారం విస్తృతంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మ్యాన్‌హోల్స్ సమస్య అధికంగా ఉందని తెలుసుకున్న ఆమె జలమండలి అధికారులతో సమావేశమై తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రమణానాయుడు, జిహెచ్‌ఎంసి, జల మండలి అధికారులు పాల్గొన్నారు.



రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జాంబాగ్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్), గడ్డంగంగాధర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో రంజాన్ ఈదుల్‌ఫితర్‌ను జరుపుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## రోడ్డు ఆక్రమణలను సహించేది లేదు

**కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్**



కాలనీ వాసులతో కార్పొరేటర్

అల్వాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: రోడ్డు ఆక్రమణలను ఎట్టి పరిస్థితిలోనూ సహించేది లేదని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ స్పష్టం చేశారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని లోటస్ పాండ్ కాలనీ రోడ్డు ఆక్రమణకు సంబంధించి స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుని రావడం జరిగింది. కాలనీలో పర్యటించిన కార్పొరేటర్ రోడ్డు ఆక్రమణను పరిశీలించారు. తక్షణం ఆక్రమణలను తొలగించాలని సబిత అనీల్ కిషోర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ కార్తీక్ టిపిఎస్ రాజేందర్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, శ్యాంసుందర్, ప్రభాకర్, భాస్కర్ అనిల్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల పరిరక్షణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి**

అల్వాల్ ఏప్రిల్ 21 ప్రభాతవార్త: చెరువుల పరిరక్షణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం చినరాయుని కొత్త చెరువులను జిహెచ్‌ఎంసి ఇరిగేషన్ రెవెన్యూ యంత్రాంగంతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఇటీవల ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రిన్సిపల్ కార్యదర్శి అరవింద్ కుమార్ ఇతర అధికారులు ఆయా చెరువులను సందర్శించారు. చెరువుల్లో కలుస్తున్న మురికి నీటి మళ్లింపు పట్ల ప్రధానంగా వారు చర్చించారు. దీంతో పాటుగా పూడికతీత అభివృద్ధికి సంబంధించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. స్థానిక అధికారులతో పనుల గురించి కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాలకు త్వరగా పూర్తి చేయాలని శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి ఎస్ఇ చిన్నారెడ్డి ఇరిగేషన్ డిఇ పవన్, ఇఇ రాజు డిఇ, మహేష్, ఎసిపి విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## 58, 59 జీవో కింద 30తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి

**మారేడ్‌పల్లి తహాశీల్దార్ కె. మాధవిరెడ్డి**

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న నిరుపేదలు 58,59 జీవో కింద ఈ నెల 30వ తేదీలోపు క్రమబద్ధీకరణ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని మారేడ్‌పల్లి తహాశీల్దార్ కె. మాధవిరెడ్డి తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్నట్లు ఇల్లు, కరెంట్, నల్లా బిల్లులు ఆధార్ కార్డు వంటి ధృవీకరణ పత్రాలు దాఖలు చేసి ఈ నెల 30వ తేదీలోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. దారిద్రరేఖకు దిగువనున్నవారు 58 జీవో కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా క్రమబద్దీకరణ చేస్తామన్నారు ఆ పైబడిన వారికి 59 జీవో కింద క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. మారేడ్‌పల్లి మండల పరిధిలోని వివిధ మురికివాడలు, ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఇళ్ల నెంబర్లు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



నార్సింగి మున్సిపాలిటీ వివేకానందనగర్ కాలనీలో ఇంటి నెంబర్లు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరుతున్న చైర్ పర్సన్ రేఖ యాదగిరి

నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపాలిటీ పరిధి లోని వివేకానందనగర్‌లో నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నెంబర్లు కేటాయించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను చైర్ పర్సన్ రేఖ యాదగిరి కోరారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన 60.గజాల పట్టాలను కొందరు తమ అవసరాల కోసం ఇతరులకు అమ్ముకున్నారని, వాటిని కొని ఇళ్లు కట్టుకున్న వారికి అధికారులు ఇళ్ల నెంబర్లు కేటాయించడం లేదన్నారు. ఈ విషయంలో పేదలకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యేను కోరినట్లు రేఖ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఇళ్ల నెంబర్లు ఇవ్వాలని ఆదేశించారని రేఖ యాదగిరి తెలిపారు.

## పేకాట స్థావరంపై దాడి చేసిన నార్సింగి పోలీసులు

**7గురు నిందితుల రిమాండ్**

**రూ.49,270 నగదు, ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం**

నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న పేకాట స్థావరంపై నార్సింగి పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. మూడు ముక్కలాడుతున్న 7.గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, వారి వద్ద నుంచి ఓ సెట్ ప్లేయింగ్ కార్డ్స్, రూ.49.270ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామానికి చెందిన జాదవ్ జీవన్ తన ఇంట్లో ఆటకు రూ.1000.తీసుకుంటూ గుట్టుగా పేకాట ఆడిస్తున్నాడు. విశ్వసనీయంగా సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు దాడి చేయగా మొత్తం 7.గురు సభ్యులు పట్టు బడ్డారు. నిర్వాహకుడైన జాదవ్ జీవన్, యమన ఇంద్రయ్య, రతల్వాత్ రవి, యమన ఎల్ల గౌడ్, బనావత్ రమేష్, సిద్ద బాల కృష్ణ, అంకూరి నాగరాజులను మూడు ముక్కలు ఆడుతుండగా పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. వీరి వద్ద లభించిన నగదును సీజ్ చేశారు. ఏడుగురిని రిమాండ్‌కు తరలించి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

## రొటర్‌డ్యామ్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్‌డే

ఘట్‌కేసర్, ఏప్రిల్ 21, ప్రభతవార్త: విద్యార్థుల్లోని మేధాశక్తిని వెలికితీయడంలో టీచర్లు సహకారం ఉంటుందని రొటర్‌డ్యామ్ స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని రొటర్‌డ్యామ్ అంతర్జాతీయ పాఠశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక విద్య పూర్తి చేసుకొని 6వ తరగతికి వెళ్తున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అందరిని అలరించారు. పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావం వాటి వల్ల కల్గే నష్టంపై నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకున్నది. విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలు, జ్ఞాపకశక్తిని పెంచే మ్యాథ్స్ యాక్టివిటీస్ విద్యార్థులలోని సృజనాత్మకతను తెలియజేశాయి.

## మోడీ సర్కారుకు బుద్ధి చెప్పాలి: సిపిఐ

సికింద్రాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మోడీ హటావో దేశ్ బచావో అంటు నినాదాలు చేస్తూ సీపీఐ బౌద్ధనగర్ డివిజన్‌లో ఇంటింటికి సీపీఐ కార్యాక్రమాన్ని జరిపారు. కరపత్రాలను పంచుతూ దేశంలో మోడీ సర్కారు వచ్చిన తరువాత పేదలు బ్రతకడమే నరకంగా మారిందన్నారు. ప్రతినిత్యం వినియోగించే పెట్రోలు, డీజీల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసి పేదల నడ్డివిరుస్తున్నారని తెలిపారు. అచ్చేదిన్ ఆగయా అంటు మోడీ అధికారంలోకి వచ్చి నిత్యవసరాలపై ధరలు పెంచేసి సామాన్య ప్రజలకు సచ్చేదిన్ దీసుకువస్తున్నారంటు మండిపడ్డారు. ఈ కార్యాక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయకార్యాదర్శి స్టాలిన్, సికింద్రాబాద్ నియోజకవర్గం కార్యాదర్శి కాంపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఉమర్‌ఖాన్, మహ్మద్ యూనుఫ్, ఎస్‌కె లతీఫ్, లక్ష్మణ్, సయ్యద్ షకిల్, కల్యాణ్, మాదవులు తదితరులు పాల్గొన్నారు.

## తీర్థయాత్రలకు బయలుదేరిన మున్సిపల్ కార్మికులు

నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : నార్సింగి మున్సిపల్ ఖానాపూర్ గ్రామంలో పని చేస్తున్న 10.మంది కార్మికులు శుక్రవారం తీర్థయాత్రకు బయలు దేరి వెళ్లారు. వీరు వెళ్లేందుకు బస్సు, వసతి ఖర్చులను స్థానిక కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత కృష్ణ(కిషన్)లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ, వాన, చలిలను లెక్క చేయకుండా నిత్యం రోడ్లు, డ్రైనేజిలు శుభ్రపరుస్తున్న కార్మికులకు మానసిక ప్రశాంతత లభించేలన్న ఉద్దేశంతో ప్రతీ ఏటా తీర్థయాత్రలకు పంపిస్తున్నామని వివరించారు. కార్మికులు ఉత్సాహంగా పని చేస్తుండడం వల్లనే గ్రామంలోని రోడ్లన్నీ, డ్రైనేజీలన్నీ పరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. తమ గ్రామ పెద్దల సహకారంతో ప్రతీ ఏటా తీర్థయాత్రలకు వెళ్లి వస్తున్నామని, చాలా సంతోషంగా ఉంటుందని కార్మికులు పేర్కొన్నారు.

## పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం



మైనార్టీలకు రంజాన్ పండుగ తోఫాను అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్, ఇస్మాయిల్ ఖాన్

చార్మినార్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : బిఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల అభ్యున్నతి కోసం అన్ని విధాల కృషి చేస్తున్నదని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు అనిల్ కుమార్, మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్‌లు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గంలోని కాలీకబర్ ప్రాంతంలో శుక్రవారం వారు మైనార్టీలకు రంజాన్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా తబాసుం అనే మహిళకు షాదీ ముబారక్ పథకం కింద లక్షా నూట పదహారు రూపాయల చెక్కును అందజేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ నాయకులు కృష్ణమోహన్, ఎంఐఎం నాయకులు ఆసిఫ్, రవూఫ్ పాల్గొన్నారు.

### దండెం రాంరెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేసిన టీపీసీసీ క్రమశిక్షణ సంఘం..?

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు దండెం రాంరెడ్డికి టీపీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మాజీ మంత్రి, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గారి షోకాజ్ నోటీసులు జారి చేసారు. పార్టీ నియమావళిని ఉల్లంఘించినందుకు నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. టీపీసీసీ కార్యదర్శి పేరుతో మండల పార్టీ అధ్యక్షులకు, మున్సిపల్ అధ్యక్షులకు, స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడంపట్ల పలువురు మండల పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు అధిష్టానానికి ఫిర్యాదు చేసారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన అనంతరం టీపీసీసీ క్రమశిక్షణ సంఘం పార్టీ నియమాలను ఉల్లంఘించినందుకు దండెం రాంరెడ్డికు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ మండల పార్టీ, మున్సిపల్ అధ్యక్షులకు, స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేయడమే కాకుండా అవసరమైతే సస్పెండ్ చేస్తామన్నారు.



నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## కమిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

**ఎమ్మెల్సీకి నాయి బ్రాహ్మణుల వినతి**



నాయి బ్రాహ్మణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్ నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును తన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నాయి బ్రాహ్మణ సంఘం కమిటీ హాల్ నిర్మాణానికై తగిన స్థలం కేటాయించాలని ఎమ్మెల్సీకి విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్సీ త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ పీఏసిఎస్ చైర్మన్ మిద్దెలబాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు స్వామినాయి, రవి నాయి, అనిల్, శ్రీనివాస్, జితేందర్, మురళి, కిషన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## లలితరస హృదయుడు రాము

**ఆదాయపన్నుశాఖ విశ్రాంత కమిషనర్ నరసింహప్ప**



ధర్నాచౌక్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: వేయికి పైగా లలిత గీతాలు రచించిన రాము లలితరస హృదయుడని ఆదాయపన్నుశాఖ విశ్రాంత కమీషనర్ నరసింహప్ప కొనియాడారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో అమృత వార్షిణి సాంస్కృతిక సంస్థ నిర్వహణలో శుభోదయం గ్రూప్ సౌజన్యంతో విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జీవిత సాఫ్య పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ ఎం.కె.రాముకు పురస్కారం అందచేశారు. ఈ సదర్భంగా నరసింహప్ప మాట్లాడుతూ రాము రసమయి సంస్థ స్థాపించి, ఎందరో కళాకారులకు వేదిక కల్పించారని కొనియాడారు. కార్యక్రమ అధ్యక్షులు దూరదర్శనన విశ్రాంత సంచాలకులు మధుసూదన్‌రావు మాట్లాడుతూ రాము వేయికి పైగా లలిత గీతాలు రాశాడని, అందులో కొన్ని బాలసుబ్రహ్మణ్యం ఆలపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు కిరణ్‌కుమార్, రామదాసు, నటులు విక్రమ్, శ్రీవాణి, కళాపోషకులు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి కృష్ణ ప్రసాద్, లలితారెడ్డి, భాస్కర్, అనూష, ప్రవీణ్ తదితరులు ఆలపించన పాటలు ఆకర్షించాయి.

## హిమాయత్‌నగర్ డివిజన్‌లో ప్రజా సమస్యలు పరిష్కారించాలి

**మేయర్‌కు కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ విజ్ఞప్తి**

హైదరాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని స్థానిక కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ జిహెచ్‌ఎంసికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్పోరేటర్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీ మాట్లాడుతూ హైదరాబాద్ నగర్‌లో ప్రతిష్టాత్మకమైన ఈ డివిజనల్ విద్యావంతులు, విద్యార్థులు, మేదావులు, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారని, అంతేకాకుండా ఇక్కడ ఎమ్మెల్యే క్వార్టర్స్ ఉందని, ఇందులో ప్రజా ప్రతినిధులు నివసిస్తున్నారని తెలిపారు. అయితే ప్రజలు ఆనేక ఇబ్బందులకు గురువుతున్నారని, ముఖ్యంగా 23 రోడ్లు దెబ్బతిన్నాయని, 22 స్కూల్స్‌లో లక్ష మందికిపైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, వీధిలైట్లు పనిచేయడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయడం లేదని, మంచినీరు సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజా సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మున్సిపల్ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. పై సమస్యలను దృష్టిలో పెట్టుకుని మేయర్ ఈ డివిజన్‌కు ప్రత్యేకంగా బడ్జెట్ విడుదల చేసి ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## 25న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంను ఈ నెల 25వ తేదీన దుర్గానగర్ చౌరస్తాలో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నమని నియోజకవర్గం శాసన సభ్యులు టి.ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి దుర్గానగర్ చౌరస్తాలో సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్, వర్కింగ్ ప్రెశిడెంట్, మంత్రి కేటిఆర్ ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలు ఎంతో ఉత్సాహంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మండలాల స్థాయి సమ్మేళనాలు ఘనంగా జరిగాయని, ఈ నెల 25వ తేదీ మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంను నిర్వహించనున్నామని ఆయన తెలియజేశారు. పార్టీ వర్కింగ్ ప్రెశిడెంట్, మంత్రికేటిఆర్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేయనున్నారని, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కం రాఘవేందర్ యాదవ్, గుమ్మడి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.




మాచర్ల రవిళి
తల్లిదండ్రులు : లక్ష్మి, మురళి
బన్సీలాల్‌పేట, సికింద్రాబాద్

## కాంగ్రెస్ నాయకుల ధర్నాతో దద్దరిల్లిన బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయం

**పరిష్కారమైన కార్మికుల సమస్యలు.. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణయాలుంటాయి : కమిషనర్**



బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు, కార్మికులకు సమాధానం చెబుతున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : చెత్త కార్మికులకు న్యాయం చేయాలంటూ కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ధర్నాతో శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్యాలయం దద్దరిల్లిపోయింది. కమీషనర్, పాలకవర్గ సభ్యులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద పెట్టున నినదించారు. కమిషనర్ కమీషన్లపై చూపుతున్న శ్రద్ధ, ప్రజల సమస్యలపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కొత్త చెత్త ఆటోల కేటాయింపు విషయంలో పాలకవర్గం, అధికారులు తీసుకున్న నిర్ణయాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నా యన్నారు. గత ఐదు రోజులుగా ఇళ్లల్లోని చెత్తను ఎత్తకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా, పాలకవర్గం స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రజలు అంటు రోగాల బారిన పడితే ఎవరు బాధ్యత తీసుకుంటారని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టి మరింత జఠిలం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు వెంటనే స్పందించి చెత్త ఆటోల కార్మికుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలని, ఇళ్లల్లోని చెత్తను ఎత్తి ప్రజలను అంటు వ్యాధులకు దూరం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా కమీషనర్ కమీషన్ల కోసం మొద్దు నిద్ర నటిస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా మార్టిగేజ్ రిలీజ్‌లు చేసి లక్షల డబ్బులు వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్పోరేషన్‌కు వస్తున్న ఆదాయం ఎంతా? ఖర్చులు ఎంత? ఎక్కడెక్కడ ఎన్ని నిధులు ఖర్చు చేశారో చెప్పాలంటూ ముఖం చాటేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన ధర్నాతో అధికారులు దిగి వచ్చి కార్మికులకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ప్రేమ్, టిల్లు, అభిలాష్ పాల్గొన్నారు.

**కమిషనర్ వివరణ :** కొత్త వారికి చెత్త ఆటోల కేటాయింపు అంశంలో ప్రభుత్వ నిబంధనల మేరకే పాలకవర్గం నిర్ణయం తీసుకుందని కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గతంలో లక్ష జనాభా ఉంటే ఇప్పుడు రెండు లక్షలకు పెరిగిందని, ఫలితంగా చెత్త సేకరణ కోసం కొత్తగా 20.ఆటోలకు అవకాశం ఇచ్చామని తెలిపారు. పాత వారికి ఒక్కో ఆటోకు 500.ఇళ్లను కేటాయించామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో ఆటోకు కేవలం 250ఇళ్లనే కేటాయించాల్సి ఉంటుందన్నారు. పాత వారిని ఒక్కరిని కూడా తొలగించలేదన్నారు. అవసరమైతే పాత వారికి 600.ఇళ్లను కూడా కేటాయిస్తామని కమీషనర్ స్పష్టం చేయడంతో కార్మికులు, కాంగ్రెస్ నాయకులు తమ ధర్నాలను నిలిపివేశారు. శనివారం నుంచి ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరిస్తామని కార్మికులు స్పష్టం చేశారు.

## వాటర్‌వర్క్స్‌లో పనిచేసే కార్మికుల వేతనాలు పెంచాలి

**హెచ్‌ఎండబ్లూఎస్ఎస్‌బి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్**



వాటర్‌వర్క్స్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: వాటర్‌వర్క్స్‌లో పనిచేసే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని హెచ్‌ఎండబ్లూఎస్ఎస్‌బి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి.నారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 700మంది కార్మికులు వాటర్‌బోర్డు కార్యాయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం డైరెక్టర్ శ్రీధర్‌బాబు, సిజిఎం ఖాదర్ ఆలీ వచ్చి వినతిపత్రం తీసుకుని యూనియన్ ప్రతినిధులతో కలిసి చర్చించారు. ఈసందర్భంగా కార్మికులనుద్దేశించి యూనియన్ అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ వాటర్ బోర్డులో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించడం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోని కార్మికులందరికీ ప్రభుత్వ రెండుసార్లు వేతనాలు పెంచి కేవలం వాటర్ బోర్డులో మాత్రమే పెంచలేదన్నారు. కావున ఎండీ దానకిశ్కర్ చొరవ తీసుకుని వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లక్షలాదిమంది కార్మికులకు వేతనాలు పెంచి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న సిఎం కెసిఆర్ తమ వేతనాలు సైతం పెంచుతారన్న విశ్వాసం ఉందన్నారు. స్వయానా కెటిఆర్ వేతనాలు పెంచాలని ప్రతిపాదనలు పంపినా అధికారుల సమన్వయ లోపంతో ఆలస్యమవుతుందన్నారు. తమ జీతాలు పెరిగే వరకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని నారాయణ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, బాలరాజు, జగన్, సురేస్ బాబు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి హత్య కేసులో దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం



**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 21, ప్రభాత వార్త : బాలుడి హత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్‌లోని అల్లా ఉద్దీన్ కోటికి చెందిన బాలుడు వాహిద్ (8) దారుణ హత్యకు గురైన విషయం తెలుసుకున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించిన వివరాలను బాలానగర్ డిసిపి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అల్లా ఉద్దీన్ కోటి ప్రజలు భయాందోళనకు గురయ్యారని, ఎలాంటి ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని తెలిపారు. ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అభం శుభం తెలియని ముక్కు పచ్చలారని చిన్నారి బాలుడి మృతి చాలా బాధాకరమని అన్నారు. పవిత్ర రంజాన్ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న బాలుడిని హత్య చేయడం దుర్మార్గపు చర్య అని విచారం వ్యక్తం చేశారు. ఈ దురాఘతానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఎల్ఆర్ఐఎంటీ కళాశాల వార్షికోత్సవం



గెలుపొందిన బహుమతులతో కళాశాలల విద్యార్థులు

దుండిగల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ కళాశాలల్లో ఎలీసియం 2023 పేరుతోకళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్ర వారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన డా.లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి అనుగుణంగా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని, సాంకేతిక రంగంలో దేశ అభివృద్ధి పాటుపడాలని అన్నారు. తమపై విశ్వాసంతో ఎన్నో కలలు కనే తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాట్య, నాటక, సంగీత ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభన కనబరచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి, డా.అర్ణబ్‌మాలిక్, చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సెక్రెటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ట్రెజరర్ మర్రి మమత రెడ్డి, డైరెక్టర్ శ్రేయారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బండ్లగూడ కార్పోరేషన్‌ను సందర్శించిన

## నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ప్రతినిధులు



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌ను సందర్శించిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ అధికారుల బృందం

నార్సింగి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌కు శుక్రవారం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ ప్రతినిధుల బృందం వచ్చింది. కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అధ్యక్షతన అధికారుల బృందం సమావేశమై ఇక్కడ సమర్థవంతంగా అమలు చేస్తున్న ఆన్‌లైన్ సేవలు, పన్ను మదింపు, రివిజన్ పద్ధతులు, గ్రీనరీ, ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీటి సరఫరా తదితర అంశాలను అధికారుల బృందంకు వివరించారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన అధికారులు, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ అధికారులు అనురాగ్ చందర్, జగన్ ఠాకూర్, బిఆర్.శర్మ, ప్రదీప్ వర్మ, రాజేందర్ చౌహాన్, ధర్మపాల్ శర్మ, కిషన్, అక్షిత్ గుప్త, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, సిడిఎంఎ కన్సల్టెంట్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్.ఐ నిర్మల, అకౌంటెంట్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది

**సాట్స్ చైర్మన్ డా. ఆంజనేయగౌడ్**



క్రీడల్లో గెలుపొందిన వారితో డా. ఆంజయనేయ గౌడ్,ప్రొ.సత్యనారాయణ, ప్రిన్సిపల్ చింతసాయిలు

తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందని సాట్స్ చైర్మన్ డా. ఆంజనేయ గౌడ్ పేర్కొన్నారు. ఓ.యూ టెక్నాలజీ కళాశాలలో వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా హాజరైన ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యం అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ల కృషితో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్స హిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం 17వేలకు పైగా క్రీడా ప్రాంగణాలను నిర్మించిందని,రాష్ట్రం ఏర్పడిన తరువాత క్రీడల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ రూ.12వేల కోట్లకు పైగా ఖర్చు చేశారని పేర్కొన్నారు. క్రీడల ద్వార మానసిక ఆరోగ్యం పొందడంతో పాటు కుటుంబ సభ్యులతో కూడా సఖ్యతగా ఉండే అవకాశం ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు పేర్కొన్నారు. విద్యార్థులకు క్రీడలు ఎంతో ముఖ్యం అన్నారు. వివిధ పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి ఆంజనేయ గౌడ్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్, ప్రిన్సిపల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొ.వి.సత్యనారాయణ, టెక్నాలజీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ హయవదన, డా. డి. అర్జున్, సర్దార్ జస్పాల్ సింగ్, డా. ఎ.పరుశురాం, బీఆర్ఎస్వీ నాయకులు కిరణ్ గౌడ్, టీఆర్ఎస్వీ ప్రధాన కార్యదర్శి తుంగబాలుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఓలా, ఉబెర్‌లు వినియోగిస్తున్న రాష్ట్రయేతర వాహనాలను నిషేదించాలి

**ఏఐటియూసి తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ డిమాండ్**

హైదరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: నగరంలోని ఐటికారిడార్‌లో ఓలా, ఉబెర్ సంస్థలు అక్రమంగా వినియోగిస్తున్న రాష్ట్రయేతర వాహనాలను తక్షణమే నిషేదించాలని ఏఐటియుసి తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం ఖైతరా బాద్‌లోని ట్రాన్స్‌పోర్టు భవన్‌లో రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బుద్ధప్రకాష్‌జ్యోతిని అసోసియేషన్ అధ్యక్షులు బైరగోని రాజుగౌడ్, నేతలు కృష్ణయ్య, భరత్ ముదిరాజ్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజుగౌడ్ మాట్లాడుతూ ఓలా ఉబెర్ సంస్థలు తమిళనాడు, కర్ణాటక మహారాష్ట్రలకు చెందిన ద్విచక్ర, ఆటో క్యాబ్ వాహనాలను టెంపరరీ పర్మిట్లు తీసుకుని పర్మనెంట్‌గా ఐటీ కంపెనీలలో పటెల్లి అక్రమంగా ఆర్జించి తెలంగాణ డ్రైవర్ల పొట్టలు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా హైదరాబాద్ నగరంలో ప్రజలను తమ గమ్యాలకు చేర్చడానికి వారు రాష్ట్రయేతర వాహనాలు వినియోగిస్తున్నారని ఆయన వాపోయారు. విద్యావంతులమైన తాము ఉద్యోగాలు దొరకక, కటుంబసభ్యులను పోషించుకోవడానికి ఫైనాన్స్ కంపెనీల ద్వారా వాహనాలు కొనుగోలు చేసి రోడ్డుపైకొస్తే బేరాలు దొరకక తీవ్ర ఇబ్బందులు పడి నష్టపోతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రాష్ట్రేతర వాహనాలను నిషేదించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే మైనంపల్లిని పరామర్శించిన మంత్రి మల్లారెడ్డి



ఎమ్మెల్యే మైనంపల్లిని పరామర్శిస్తున్న మంత్రి మల్లారెడ్డి, బిఆర్ఎస్ ఇన్‌చార్జిలు శ్రావన్, మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: సికింద్రాబాద్ యశోధ ఆసుపత్రిలో మోకాలు శస్త్ర చికిత్సచేయించుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్‌ను శుక్రవారం రాష్ట్ర కార్మిక మంత్రి సి.హెచ్.మల్లారెడ్డి, హైదరాబాద్ జిల్లా బిఆర్ఎస్ ఇన్‌చార్జి దాసోజు శ్రావన్ కుమార్, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జల నాగేశ్‌లు ఎమ్మెల్యే మైనంపల్లిని పరామర్శించారు.

## ఆసుపత్రికి వెలుతున్నానని ఇంట్లో చెప్పి తల్లి కుమారుడి అదృశ్యం

జవహర్‌నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : ఆసుపత్రికి వెలుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన మహిళ తన కుమారుడితో సహా అదృశ్యమైన సంఘటన జవహార్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహేష్ రుహిదాస్ తన భార్య లతా రుహిదాస్ (30), కుమారుడు సోహం రుహిదాస్ (12)తో కలిసి హాకీంపేట్‌లో నివాసము ఉంటూ పెయింటింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. తన భార్య సోదరి ఆశాధార మణిపూర్ నుంచి హాకీంపేటకు వచ్చింది. రోజులాగే గురువారం ఉదయం పనికి వెళ్లిన తన భార్య మధ్యాహ్నం ఇంటికి వచ్చింది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఆశాధార, లత రుహిదాస్, సోహం రుహిదాస్‌లు ఆసుపత్రికి వెళ్తామని ఇంట్లో చెప్పి వెళ్లారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువు ఇళ్లల్లో వెతికిన ఆచూకీ తెలియకపోవడంతో శుక్రవారం మహేష్ రుహిదాస్ జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్యానికి సహాయం



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 33వ వార్డు రాజీవ్‌గృహ కల్పలో నివాసం ఉంటున్న శ్రీను, సాకీర్ ఆరోగ్య పరిస్థితిని కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తెలుసకొని వారికి ధైర్యం చెప్పి తమ వైద్యానికి తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మంచినీటి సరఫరా తదితర సమస్యలను శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను త్వరంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరిగే ముత్యాలు, లిమెందర్, నర్సింహ, చంద్రయ్య, సుదర్శన్, సుధాకర్, స్థానికులు పాల్గొన్నారు.

## కలుషిత మంచినీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తాం

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ధర్నాచౌక్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజ కవర్గంలోని అడిక్‌మెట్ డివిజన్‌లోని బస్తీలలో నెలకొని ఉన్న కలుషిత మంచినీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. శుక్ర వారం బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు బస్తీలలో ఆయన పర్యటిం చారు. ఈ సందర్భంగా బస్తీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. బస్తీప్రజలు ఎదుర్కొంటున్న మంచి నీరు, డ్రైనేజి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్య లు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకులు ముఠా జైసిం హ, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సురేం దర్, నాయకులు శ్యాంసుందర్, చిట్టి, మాధవ్, సీతారామాం జనేయ దేవాలయ చైర్మన్ రవియాదవ్, ట్టైలర్ శ్రీను, మల్లి ఖార్జు న్‌రెడ్డి, సుధాకర్‌గుప్తా, బస్తీ అధ్యక్షులు శ్రీనివాస్, బాలకృష్ణ, జలమండలి అధికారులు మోహన్‌రాజ్, శివ పాల్గొన్నారు.

## సర్వ మతాలకు ప్రాధాన్యతనిస్తున్న కెసిఆర్

జవహార్‌నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కెసిఆర్ సర్వమతాలకు ప్రాధాన్యతనిస్తూ గతంలో ఏ ప్రభుత్వము చేయని విధంగా ప్రస్తుతం అన్ని మతాల పండుగలకు కానుకలు పంపిణీ చేయడం జరుగుతుందని జవహార్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య తెలిపారు. శుక్రవారం బిఆర్ఎస్ జవహార్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో 200 మంది ముస్లిం సోదరులకు రంజాన్ ఈద్ ముబారక్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మేయర్ కావ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జవహర్ నగర్‌లో ముస్లింలు అధికంగా ఉన్నారని గుర్తించి అదనంగా కిట్లను అందించిన రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి లకు కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారుక్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సాధిక్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కొండల ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి కాసిం, సోషల్ మీడియా ఇంచార్జ్ హైమద్, మైనార్టీ అధ్యక్షుడు ఎండి రఫిక్, మైనార్టీ జనరల్ సెక్రెటరి ఎండి మతిన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ యూసుఫ్, ఫైసల్, నయీమ్, ఎండి కాజా పాషా, శంషుద్దీన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముగ్ధమనోహరంగా కూచిపూడి నృత్యప్రదర్శన



రవీంద్రభారతి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త : ప్రముఖ శ్రీ శారదా నృత్యనికేతన్ సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో శుక్రవారం రాత్రి ప్రఖ్యాత నాట్యగురువు శైలజా ప్రసాద్ శిష్యురాలు ధీత్యారెడ్డి కూచిపూడి నృత్యప్రదర్శన రమణీయం, ముగ్ధమనోహరంగా సాగింది. ధీత్యారెడ్డి చిన్ననాటి నుండి భారతీయ శాస్త్రీయ కళలపట్ల అమితాశక్తితో గురువు వద్ద శాస్త్రీయ కూచిపూడి నృత్యంలో సంపూర్ణ శిక్షణ, మెళకువలు అభ్యసించి తన తొలి ప్రదర్శనలో ముందుగా గంభీరనాట రాగం కందచాపు తాళంలో శ్రీ విఘ్నరాజం భజే; కురంజిరాగం ఆదితాళంలో ముద్దుగారే యశోదా; అరభిరాగం ఆదితాళంలో దశావతార అష్టపది; భైరవిరాగం మిశ్రచాపు తాళంలో భామాకలాపం; రాగమాలికరాగం ఆదితాళంలో మరకత మణిమయ చేల; నీలాంబరిరాగం ఆదితాళంలో శృమ్గారలహరి కృతి; ధనీశ్రీరాగం ఆదితాళంలో తిల్లానా అంశాలను శృతి, లయబద్ధంగా అద్భుత హావభావాలను ప్రదర్శించి మంగళంతో తన కూచిపూడి ఆరంగేట్రం ముగించి విచ్చేసిన అశేష ప్రేక్షకులను మంత్రముగ్ధులను కావించింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి, గౌరవ అతిథులు బి.వి.పట్టాభిరామ్, డా. పార్వతి వర్దని, డా. ఇంద్ల రామసుబ్బారెడ్డి, ధీత్యారెడ్డి తల్లిదండ్రులు బి.రవికాంత్‌రెడ్డి, సునీత, నాట్యగురువు శైలజా ప్రసాద్ తదితరులతో కలిసి ధీత్యారెడ్డిని ఎంతగానో అభినందించి ప్రేక్షకులతో కలిసి ఆమెకు శుభాశీస్సులందించారు.

## స్వామి వారి బ్రహ్మోత్సవాలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త : ఈ నెల 25వ తేదీ నుండి 27వ తేదీ వరకు జరగనున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆహ్వానించారు. శుక్రవారం శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం బల్కంపేట నూతనంగా నియమితులైనటువంటి పాలకమండలి సభ్యులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, డివిజన్ అధ్యక్షులు ఎం.హనుమంతరావు, సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డు కుమార్ గౌడ్, ఈఓ ఎస్. నరేందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు వేణుగోపాల చార్యులు, స్థానిక నాయకులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, బొడ్డు శ్రవణ్‌కుమార్‌గౌడ్, బల్కంపేట శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యులు కూతురు నరసింహ పాల్గొన్నారు.

## పవిత్ర రంజాన్ ఇఫ్తార్‌తో మతసామరస్యం

ఘట్‌కేసర్, ఏ ప్రిల్ 21, ప్రభాతవార్త: రంజాన్ మాసంలో ముస్లీం సోదరులు భక్తి, శ్రద్దలతో ఉపవాసదీక్షలు చేపట్టి అల్లా అనుగ్రహం పొందుతారని టీపీసీసీ ఉపాధ్యక్షులు-మేడ్చల్ నియోజకవర్గ సమన్వయకర్త తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా ఘట్‌కేసర్‌లోని జామియా మస్జీదులో సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మాజీ వార్డుసభ్యులు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో వజ్రేశ్‌యాదవ్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులకు పళ్లు తినిపించి ఉపవాస దీక్షలను విరమింపజేశారు. ఇఫ్తార్‌లో హిందూ, ముస్లీంలు కలిసి పాల్గొనడం ద్వారా మతసామరస్యం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనారిటీ సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, బోడుప్పల్ ఎంసీ కార్పొరేటర్ తోటకూర అజయ్‌యాదవ్, ఎంపిటిసి పుల కంటి భాస్కర్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొత్త సుశాంత్‌గౌడ్, ఘట్‌కేసర్ మున్సిపల్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, వార్డుసభ్యులు రడమల్ల బోజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు వుల్లి అంజనేయులు, చౌదరిగూడ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కట్ట అంజనేయులుగౌడ్, ఖాజా, నాయకులు బొక్క సత్తిరెడ్డి, సురేశ్‌గౌడ్, ఫయిమ్, ఖలీల్‌అక్రమ్, మల్లేశ్, మధు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ

## వేసవి శిక్షణ శిబిరం

అఫ్జల్‌గంజ్,ఏప్రిల్ 21ప్రభాతవార్త: బాస్ అనుబంధ సంస్థ సారస్వతం ఆద్వర్యంలో ఈనెల 30వ తేదిన ఉస్మాన్‌గంజ్‌లోని సంస్థ కార్యాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మ్యూజికల్ క్లాస్,శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ,ప్రధాన కార్యదర్శి విజయ్‌బాస్కర్,కోశాధి కారి మేడిశెట్టి రాకేష్‌లు తెలిపారు. ఈమేరకు సారస్వతం అధ్యక్షులు అనిల్‌నాయర్, భద్రి, బిక్షపతి, అంజన్‌లతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఈనెల 30 నుంచి సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులచే కీబోర్డు,డ్రమ్,కాంగ్, తబలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉస్మాన్ గంజ్‌లోని బాస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. శిక్షణ పూరైన తరువాత బాస్ సర్టిఫికెట్లను అంద చేయడం జరుగుతుందన్నారు.

## కాంట్రాక్టర్లకు ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచండి



సిఎండీ రఘుమారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న డిస్కం కాంట్రాక్టర్లు

హైదరాబాద్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త: విద్యుత్ యాజమాన్యం కాంట్రాక్టర్లకు స్టాండెర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్ (ఎస్ఎస్ఆర్)ను పెంచాలని టిఎస్ఎస్‌పిడిసిఎల్ కాంట్రాక్టర్స్ జేఏసీ డిమాండ్ చేసింది.ఈమేరకు శుక్రవారం టిఎస్ఎస్‌పిడిసిఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సిఎండీ రఘుమారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ చైర్మన్ పి.భాస్కర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ రేట్లు 30శాతానికి పెంచడంతోపాటు ఎండింగ్ బిల్లులను త్వరగా ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. తమ విన్నపాన్ని విన్న సిఎండీ సానుకూలంగా స్పందించాని ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొంటే కాంట్రాక్టర్లు సహకరించాలని సిఎండీ అన్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యులు నక్కా యాదగిరితోపాటు కె.మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.



గోషామహల్ నియోజకవర్గంలో ఆ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్) పాల్గొన్ని అన్నదానం చేశారు


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, ప్రాజెక్ట్స్ డివిజన్, సౌత్ జోన్-1
GHMC
నాన్ SSR ఐటమ్‌లకు కొటేషన్ ఐటమ్ ప్రచురణ
మెయిల్ ఐడి: eeghmcpdsz1@gmail.com, కొటేషన్ ఐటమ్స్ ప్రచురణకు నాన్ SSR ఐటమ్‌లు ఈ క్రింది విధంగా: 1) MS ప్లేట్ 5mm మందంతో మరియు 75mm x 75mm x 4mm మరియు 50mm x 50mm x 3mm సైజుల MS పైపుతో ఆర్కిటెక్చరల్ బ్యారికేడింగ్ బోర్డ్ యొక్క రవాణాల ఒక్కొక్క బోర్డుకు 6 అడుగుల పొడుగు మరియు 4 ఎత్తు కలిగి 1 కిమీ వరకు లీడ్ కొరకు లోడింగ్, అన్‌లోడింగ్ కలుపుకొని మరియు స్టేకింగ్ పూర్తిగా. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, PDSZ-I, GHMC
DIPR.No.699-PP/CL/Advt/1/2023-24, తేది: 21.04.2023

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయము, శేరిలింగంపల్లి సర్కిల్-20, SLP జోన్ GHMC
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
GHMC
నిట్ నెం.06/EE/Cir-20/SLPZ/GHMC/1-2/2023-24, తేది:21.04.2023. పని కేటగిరి: సివిల్ మరియు ఇతర పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 9.75. బిడ్ స్వీకరణ ప్రారంభ/చివరి తేదీ, సమయం: 24.04.2023 మ.01.30గం. 02.05.2023 మ.01.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం. ఇఇ, సర్కిల్-20, SLPZ, GHMC, 9849906745.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, GHMC.
DIPR.No.717-PP/CL/Advt/1/2023-24 తేదీ: 21.04.2023


## నాణ్యమైన పరిశోధనల ద్వారా ఇండో పసిఫిక్ సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చు

**బోయిన పల్లి వినోద్‌కుమార్**



ఓయూలో ఇండోపసిఫిక్ అధ్యయన సెంటర్‌ను ప్రారంబిస్తున్న వినోద్‌కుమార్, అంబాసిడర్ రాజశేఖర్,విసి

తార్నాక, ఏప్రిల్ 21 ప్రభాతవార్త: నాణ్యమైన పరిశోధనల ద్వార ఇండోపసిఫిక్ సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయిన పల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలో ఇండో...పసిఫిక్ అధ్యయన కేంద్రం ప్రారంబోత్సవానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వార భవిష్యత్ తరాలకు ప్రపంచస్థాయి సామాజిక, ఆర్థిక, సమకాలీన స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు దోహదపడుతుందన్నారు. సేల్స్‌మెన్ నుంచి అంబాసిడర్ దాకా అంతర్జాతీయ వ్యవహారాలపై కనీస అవగాహన తప్పనిసరిగా మారిందన్నారు. సెంటర్ ఏర్పాటుకు వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ చేసిన కృషి గొప్పదన్నారు. దేశ అభివృద్ధిలో విదేశీ వ్యవహారాలు ఎంతో ముఖ్యమని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ ఓఎస్డీ, అంబాసిడర్ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈలాంటి సెంటర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.అభివృద్ధి చెందుతున్న దేశాల న్ని పసిఫిక్ మహాసముద్రం తీరప్రాంత దేశాలేనని అందుకే ఇండో పసిఫిక్ అధ్య యన కేంద్రానికి ప్రాముఖ్యత ఉందన్నారు. ఓ.యూలో ప్రారంభించిన ఇండోపసిఫిక్ అధ్యయన కేంద్రానికి కేంద్ర ప్రభుత్వ విదేశీ వ్యవహారాల శాఖ అవసరమైన తోడ్పాటు అందించేందుకు సిద్దంగా ఉన్నామని చెప్పారు. ఉపకులపతి ప్రొ.రవీందర్ యాదవ్ మాట్లాడుతూ దివంగత ప్రధాని పి.వి నరసింహ్మారావు లుక్ ఈస్ట్ పాలసీ ద్వార భారత్‌కు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాల వల్ల దేశానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఓ.యూలో ఓషియన్ స్టడీస్ సెంటర్ ఉండేదని నిధుల కారణంగా అది మూత పడిందని గుర్తు చేశారు. ఇండోపసిఫిక్ అధ్యయన కేంద్రం ద్వార తిరిగి ఓ.యూకు పూర్వ వైభవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభివాణి దేవి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇండోపసిఫిక్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొ.జె.ఎల్.ఎన్ రావు, ప్రొ.ప్యాట్రిక్‌తో ఆయా విభాల డైరెక్టర్లు, రిసర్చ్‌స్కాలర్స్ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my client **Sri ANNABATTULA SUKUMAR** S/o A. RAMA CHANDRA RAO, aged about 60 years, Occupation, Business, R/o H.No.6-223/3, Vaninagar, Chintal, Hyderabad, as purchased the Flat No.301 in Third Floor, of Lakshmi Nilayam, constructed on Plot No.81, in Sy.Nos.206 to 210 and 212, adm. 22.0 Sq.yds or 18.39 s.mts undivided share of land out of 266.6 Sq.yds with plinth area of 585.0 Sq.ft including common areas and scooter parking, area, situated at Boduppal Village and Grampanchayat, Ghatkesar Mandal, Ranga Reddy District, from its original owner K. PARAMESHWAR REDDY S/o NARAYANA REDDY, resident of Ramanthapur, Hyderabad, T.S. vide Regd. Sale Deed Doc.No.4048 of 2008 Date: 30th April, 2008, and paid the substantial total amount.
That my client lost / misplaced the link document of the said property Doc. No.9645/2007, Date: 08/08/2007 while travelling from West Balaji Hills to Ambedkar Statue, Boduppal on 10th day of April, 2023, and it is not traced out in spite of my best efforts, and it is lost beyond recovery.
All are requesting if any person found the same and inform to the undersigned the office address mentioned herein below within (seven) days from today, failing which it shall be presented and it shall be deemed that the claimants has/have relinquished such claim and/or waived his/her/their rights to exercise such claim and such claim shall not be binding on my client and my client shall proceed with the transaction.

**Sd/- NALLA CHANDRAIAH**
**Advocate**
Off: Plot No.22, Laxmareddy Colony, Uppal, Hyderabad-500039.

**PUBLIC NOTICE**

**MISSING OF DOCUMENT**

**I K. Narender S/o K. Swamy** dated on 12.04.2023 for Xerox purpose I travel from Kothapet old Court to Saroornagar Sub Registrar Office I lost Original Sale Deed Document No. **6909 of 2002** of SRO Pedda Amberpet so anybody found the above document please contact me my cell number **9177883357.**
I mentioned the scheduled of property below.

**SCHEDULE OF PROPERTY**

All that piece and parcel of land bearing Plot No.120, Admeasuring 200 Sq.yards or equivalent to 167.23 Sq.Mtrs., in Survey No.267, 268 and 269, situated at ANAJPUR VILLAGE, Hayathnagar Revenue Mandal, R.R. District Registered unde Pedda Amberpet SRO, and Bounded by: North: Plot No.121, South: Plot No.119, East: 30' Feet Wide Road, West: Plot No. 93. If anybody found the above schedule property document please contact Cell No. **9177883357.**

**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE, AT : L.B.NAGAR**
**O.S. No. 268 of 2023**

Between:-
**Kantekar Deepika Bai & Others ...Plaintiffs**
AND
**Tahsildar/MRO & All Concern ...Defendants**

**NOTICE**

Please take noticed that, the above plaintiffs have filed above suit for declaration to declare them as Legal Heirs and successors of **Sri. Late Kantekar Kiran Kumar** was died on 23.09.2022, who acquired the Land bearing Plot No.38, In survey No.469 and 470 (as per revenue records Survey Nos. 469/2 and 470/1), Admeasuring 150 Sq.Yards Situated at Nadergul Village, Balapur Rev Mandal, R.R.District. And Bounded by: North: 30' Wide Road, South: Plot No.41, East: Plot No.37, West: Plot No.39, and the said suit is posted on 10.05.2023 for the objections from all concerned. Who are having any objections, therefore it is to inform to the general public that. If anybody having any objection related to above facts, and may be appear before this Hon'ble court on 10.05.2023 at 10.30 AM, either in person are through an Advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.
//By Order of the Hon'ble Court//

**Sd/- P. VITTAL**
**Advocate**
Office & Resi: 9-3-79, Champapet, Hyderabad-500079. T.S.
Ph.No.9246578782

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు : మంత్రి సబితాఇంద్రారెడ్డి



శంకుస్థాపనలు చేసిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 19వ డివిజన్ కిందకు వచ్చే పలు కాలనీల్లో రూ.2.79 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా కార్పొరేటర్ రామోజు అమితా శ్రీశైలంచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి లోకాయుక్త కాలనీ, మల్లికార్జుననగర్, సాయి నగర్, గాయత్రీహిల్స్ తదితర ప్రాంతాల్లో హెచ్‌డిపిఇ, ఎస్‌డబ్ల్యూ పైప్‌లైన్లు, సిసి రోడ్లు, ఓపెన్ జిమ్ తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, భాగ్యనగర్ సొసైటీ ఛైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, డైరెక్టర్లు చిగిరింత శ్రీరాంరెడ్డి, యెల్చల సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు యెల్చల మమతా సుదర్శన్‌రెడ్డి, రామోజు శ్రీశైలంచారి, నాదరగుల్ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఇంద్రపల్లి యాదగిరి, నాయకులు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, కోటగిరి జంగయ్య, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మేయర్ డివిజన్‌లో కంటి వెలుగు కార్యక్రమం

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్‌లో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కంటి వెలుగు పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, స్థానిక కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## దేప ఆధ్వర్యంలో రంజాన్ తోఫాల పంపిణి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రంజాన్ పండుగ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన పేద ముస్లిం కుటుంబాలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ బస్తీల్లో మైనారిటీ నాయకులు మహ్మద్ హబీబ్ ఓమర్, మన్న రవి తదితరులు నిత్యావసర సరుకుల కిట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు: నారాయణ డిజిఎం గోపాల్‌రెడ్డి




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన డిజిఎం గోపాల్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి దానిని వెలికి తీసి వారి బంగారు భవిష్యత్తుకు నారాయణ విద్యా సంస్థలు బాటలు వేస్తున్నాయని మీర్‌పేట్ నారాయణ పాఠశాల బ్రాంచి డిజిఎం గోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాలల గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి ప్రోత్సహించడం జరుగుతున్నదని తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడం తమ పాఠశాల విధానమన్నారు. కాగా గ్రాడ్యుయేషన్ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబ్జి, ఈ ఛాంప్స్ ఆర్అండ్‌డి మహేశ్వరి, కో-ఆర్డినేటర్ వాణి, మీన, స్వప్న, వైస్‌ప్రిన్సిపాళ్ళు, ఎడి, ఎఓ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడిగా రవీంద్ర




గట్ల రవీంద్రను సత్కరిస్తున్న జితేంద్రకుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆఫ్ హయత్ నగర్ డిస్ట్రిక్ట్ 320సి నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా కొత్తపేటకు చెందిన గట్ల రవీంద్ర (హైటెక్ రాము) నియామకం అయ్యారు. లైన్స్ క్లబ్ మాజీ డిస్టిక్ గవర్నర్ గార్లపాటి జితేంద్ర కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పడింది. నూతన కార్యవర్గంలో జోన్ చైర్మన్‌గా పెండం కృష్ణకుమార్, అధ్యక్షునిగా చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గట్ల రవీంద్ర, కార్యదర్శిగా జి. సంతోష్, కోశాధికారిగా అశోక్ కుమార్ నియామకం అయ్యారు. నూతన కమిటీలో నియామకమైన వారిని ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు గట్ల రవీంద్ర మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆరోగ్య శిబిరాలు, కంటి, దంతా ఇతర ఆరోగ్య శిబిరాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను కూడా నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.శంకర్, పి.భార్గవరాజు, లింగారెడ్డి, వనం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్వ మతాలకు ప్రాధాన్యతనిస్తున్న కేసీఆర్

**జవహర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి కేసీఆర్ సర్వమతాలకు ప్రాధాన్యతనిస్తూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుతం అన్ని మతాల పండుగలకు కానుకలు పంపిణీ చేయడం జరుగుతుందని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్య తెలిపారు. శుక్రవారం బిఆర్ఎస్ జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ముస్లిం మైనారిటీ కమిటీ ఆధ్వర్యంలో 200 మంది ముస్లిం సోదరులకు రంజాన్ ఈద్ ముబారక్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొని కిట్లను పంపించేశారు. అనంతరం మేయర్ కావ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంలో మైనార్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. జవహర్ నగర్ లో ముస్లింలు అధికంగా ఉన్నారని గుర్తించి అదనంగా కిట్లను అందించిన రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి లకు కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారుక్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సాదిక్ లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు కొండల ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి కాసిం, సోషల్ మీడియా ఇంచార్జ్ హైమద్, మైనార్టీ అధ్యక్షుడు ఎండి రఫిక్, మైనార్టీ జనరల్ సెక్రెటరీ ఎండి మతిన్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ యూసుఫ్, ఫైసల్, నయీమ్, ఎండి కాజా పాష, శంషుద్దీన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హిందూ ముస్లింల ఐక్యత ప్రపంచానికి చాటాలి: యెల్మేటి అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** హైదరాబాద్, నగర శివార్లలో హిందూ ముస్లింల ఐక్యత, పరమత సహనం ప్రపంచానికి చాటి చెప్పాలని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజక వర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్‌లోనున్న వైఎఆర్ గార్డెన్స్ లో అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టిపిసిసి అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, జడ్పీ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి తదితరులతో కలిసి ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు పండ్లను ఇచ్చి విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందుల ద్వారా మత సామరస్యం పెంపొందుతున్నదని అన్నారు. ఇక్కడి మత సామరస్యం, ఐక్యత, పరమత సహనం ప్రపంచానికి ఆదర్శం కావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ అఫ్జల్, అహ్మద్ బామ్, షరీఫ్ ఖాన్, ఎర్ర జైహింద్, వంగేటి మధుసూదనరెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, కృష్ణనాయక్, నల్లెంకి ధన్‌రాజ్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి, ఉమేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కలిసి కట్టుగా పని చేయాలి : మల్‌రెడ్డి రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మల్‌రెడ్డి రామ్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, పీసీసీ జనరల్ సెక్రెటరీ రఘు వీరారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యలను పక్కనపెట్టి అందరూ కలిసికట్టుగా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, నూతన కమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో మల్ రెడ్డి రామి రెడ్డి ఆధ్వర్యంలో హాత్సే హాత్ జోడో యాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి సంకేపల్లి సుధీర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, సదాశివుడు, మల్లారం శ్రీనివాసరావు, కుట్ల నరసింహ యాదవ్, శ్రీపాల్ రెడ్డి, కిషోర్ గౌడ్, మంజుల రెడ్డి, స్వర్ణ మాధవి, రమేష్ నాయక్, రాజశేఖర్, బండ సురేందర్ రెడ్డి, పంజాల జైపాల్ రెడ్డి, వేణు యాదవ్, గోవర్ధన్, నారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించాలి: చింతల

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** డివిజన్ బదులు పెండింగ్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. డివిజన్లోని సాయినగర్ రోడ్ నెంబర్-1,2 కాలనీలలోని కమ్యూనిటీ హాల్ లో శుక్రవారం స్థానిక సమస్యలపై అవగాహన సదస్సులో కార్పొరేటర్ పాల్గొని కాలనీవాసుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని ప్రతి ఒక్క సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్, మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులపై ఒత్తులు తీసుకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ సిద్దాల ఐలయ్య, శ్రీనివాస్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నల్లాల సత్యనారాయణ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త, డివిజన్ బిజెపి అధ్యక్షులు గంగనబోయిన వినోద్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నల్లాల సత్యనారాయణకు రంగారెడ్డి జిల్లా అర్బన్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్ష బాధ్యతలను సత్యనారాయణకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాణాల ప్రవీణ్ కుమార్, మల్కాజ్ గిరి పార్లమెంట్ కన్వీనర్ ఎస్సీ మోర్చా కృష్ణ ప్రకాష్, స్లం సెల్ స్టేట్ కన్వీనర్ పసుపుల హరిబాబు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన అష్టలక్ష్మి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఆర్‌కెపురండివిజన్ వాసవి కాలనీలోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 27వ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం దేవాలయంలో వేద పండితుల మంత్ర చరణ మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చైర్మన్ సోమ సురేష్, కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య గుప్తా, బ్రహ్మోత్సవ కమిటీ కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, కమిటీ సభ్యులు చిలుకా ఉపేందర్ రెడ్డి, బొగ్గరపు రవీందర్, తమ్మన శ్రీధర్, గండి శ్రీకాంత్, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునలో ఘనంగా కాన్వకేషన్ డే




కాన్వకేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

**వనస్థలిపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** వనస్థలిపురంలోని నాగార్జున మాంటేస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్‌లో శుక్రవారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వకేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నల్ల గౌనులతో విశేషంగా ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విట్టల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు పాఠశాల పట్ల మక్కువ పెంచడానికి తమ పాఠశాలలో ప్లే వే పద్ధతిలో బోధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన ఇండోర్, ఔట్‌డోర్ ప్లే గ్రౌండ్లతో పాటు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసి చిన్నారుల మానసిక వికాసంతోపాటు శారీరక వికాసానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారుల గ్రహణశక్తిని పెంపొందించడానికి ఆడియోవిజువల్ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రూ.40.5 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే బేతి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భేతి, కార్పొరేటర్ పన్నాల

**నాచారం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** ఉప్పల్ నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఇద్గాలో రూ. 40.50లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ ఫ్లాట్‌ఫాం, వెయిటింగ్‌హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భేతి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు. అంతకుముందు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి వినతి మేరకు జెడ్‌సీ పంకజ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పాదయాత్ర చేసి చేపడుతున్న పనులను పరిశీలించారు. ముఖ్యంగా ఎలిఫెంట్‌సర్కిల్‌వద్ద మహాత్ముల విగ్రహాల ముందు సుందరీకరణ చేయాలని, సంజీవయ్య పార్కు అభివృద్ధి, రజక దోభీఘాట్ పనులు వేగంగా చేయించాలని కార్పొరేటర్ జెడ్‌సీని కోరారు. జేఎన్ఎన్‌యూఆర్ఎం నుంచి శివహోటల్ వరకు రోడ్డుకు ఇరువైపుల నిత్యం ట్రాఫిక్ సమస్యల తలెత్తుతుందని ట్రాఫీక్ ఇన్స్‌పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాచారం ఇన్స్‌పెక్టర్ నందీశ్వర్ రెడ్డి, ఈఈ హరిలాల్, డీఈ రూపా, ఏఈ శ్రవంతి, నాయకులు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, వాసుదేవ్‌గౌడ్, హమాలీ శ్రీనివాస్, పీఆర్ ప్రవీణ్‌తో పాటు ఈద్గా ప్రసిడెంట్ మొయిన్‌పాషా, మసూద్, ఎండీ అల్తాఫ్, మీర్‌రెహ్మాన్ అలీ, హఫీజ్ ఖాన్, ఉమర్, మొహసీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని అండాళ్ నిలయం కమాన్ వద్ద జలమండలి పనులను వాటర్ వర్క్స్ సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ ప్రాంతంలో తరచూ వాటర్ లీకేజీ సమస్య వస్తుండడంతో స్థానికులు ఆమెదృష్టికి తీసుకురాగా వెంటనే కార్పొరేటర్ భాగ్యలక్ష్మి స్పందించి సంబంధిత జలమండలి అధికారులతో కలిసి మరమ్మతు పనులు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని లీకేజీ మరల తలెత్తకుండా పరిష్కరించాలని ఆమె అధికారులకు సూచించారు. నిత్యం డివిజన్‌లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సిబ్బంది రమేష్, గణేష్, సుభాష్, శ్రీను, సంతోష్, మల్లేష్, దినేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి : శ్వేత



'మన బస్తీ-మన బడి'ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత

**సైదాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్నలక్ష్యాలను సాధించగలుతారని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి అన్నారు. సరళాదేవి హట్స్‌లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో మన బస్తీ-మన బడి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతర ం కార్పొరేటర్ మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నెహ్రూబాబు, రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ హరిబాబు, నాయకులు శంకర్‌నాయక్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

**సైదాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** సైదాబాద్‌డివిజన్‌లో జరిగే అన్ని అభివృద్ధి పనుల్లో నిర్ధేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని సాయిగంగ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులు పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కిషోర్, సునంద, అరవింద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం : సిపిఐ

**సైదాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** సిపిఐ చేపట్టిన బిజెపి కో హటావో దేశ్ కో బచావో కార్యక్రమంలో భాగంగా సరళాదేవి నగర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి సీనియర్‌నాయకులు శంకర్‌నాయక్, నగర సహాయ కార్యదర్శి కమతం యాదగిరిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మతం పేరుతో రాజకీయం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తున్న కేంద్రం ప్రభుత్వం కార్మికులను రోడ్లపైకి తెస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మహమూద్, రూప్‌సింగ్ నాయక్, రాజు, సురేష్, మధు, సలా ్మన్, సుజాత బాయి, అస్లిబాయి తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా దుస్తుల పంపిణీ

**నాచారం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రంజాన్ పండుగను పురస్కరించుకొని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజక వర్గంలో సుమారు 72 మసీదుల్లో 300 మందికి బట్టలను పంపిణీ చేశారు. టైలరింగ్‌కు సంభందించి అయ్యే ఖర్చులను కూడా అందజేశారు. అందులో భాగంగా శుక్రవారం నాచారంలోని 9 ఇమామ్, మోజం మసీదు తధితర ప్రాంతాల్లో మైనార్టీలకు పంపిణీ చేసినట్లు సంస్థ అదినపేత బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, కటార్ల భాస్కర్, మహేష్ గౌడ్, మేకల ముత్యం రెడ్డి, అంజి, కట్టబుచ్చన్న గౌడ్, షేక్ రఫీక్, శివకుమార్, ఖదీర్, జాకీర్, రఫీక్, గఫూర్, ఫరూర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మైనంపల్లిని పరామర్శించిన మంత్రి మల్లారెడ్డి



మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును పరామర్శించిన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు (ప్రభాతవార్త, మల్కాజిగిరి)

# ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో పూల వనం : ఎమ్మెల్యే దేవిరెడ్డి

**మన్సూరాబాద్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మన్సూరాబాద్‌లోని ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌లో పూల వనం నిర్మాణానికి జీ.హెచ్.ఎం.సీ. ప్రధాన కార్యాలయంలో కమిషనర్ లోకేష్ కుమార్ సమక్షంలో కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సత్యనారాయణ పలువురు అధికారులతో పాటు సంస్థ సభ్యులచే ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ భవాని ఎంటర్ ప్రైజెస్ సంస్థ వారు పెట్టిన కేసు వెనుకకు తీసుకోవడానికి ముందుకు రావడం శుభపరిణామని, దానికి సంబంధించిన పత్రాలుఇస్తే వాటిని కోర్టులో సమర్పిస్తామని తెలిపారు. ఇది జీహెచ్ఎంసీకి సంబంధించి ఒక ఘన విజయమని, దాదాపు 18 సంవత్సరాల క్రితం డంపింగ్ యార్డు ఎత్తివేస్తామని సంస్థ సభ్యులు తెలిపారని, కానీ ఇన్ని రోజుల తర్వాత డంపింగ్ యార్డు ఎత్తివేతకు మోక్షం లభిస్తుందని తెలిపారు. అదనంగా మరో ఆరు లేదా ఏడు ప్రైవేట్ సంస్థలకు డంపింగ్ యార్డు ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోయే మూడు నాలుగు నెలల్లో డంపింగ్ యార్డు ఎత్తివేయాలని సంస్థ సభ్యులకు సూచించారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన ఫ్లవర్ పార్క్ ఏర్పాటుకు అన్ని అడ్డంకులు దాదాపు తొలగిపోయినట్టే అని తెలిపారు. డంపింగ్ యార్డు ఎత్తివేసే విషయం సంస్థ సభ్యులతో మాట్లాడి కోర్టు కేసు ఎత్తివేత విషయంలో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం చేసినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతమైన పూలవణం నిర్మించి, దేశం నలువైపులా నుంచి సందర్శకులు వచ్చే విధంగా నిర్మించడం జరుగుతుందని ఎమ్మెల్యే వివరించారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ఎమ్మెల్యే బలాలకు పండ్లు తినిపిస్తున్న బసవరాజ్‌గౌడ్ తదితరులు

**మలక్‌పేట, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మలక్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. గడ్డిఅన్నారంచౌరస్తాలో లింగాల బసవరాజ్‌గౌడ్, లింగాల శీనప్ప గౌడ్, గొట్టిపర్తి సురేష్‌గౌడ్, లింగాల శ్రీనివాస్‌గౌడ్, రంగా విక్రమ్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే బలాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలో ఉన్నవారికి ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయమని నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడంతో ప్రజల మధ్య స్నేహభావం పెంపొందుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి సోదరభావంతో జీవించాలన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఇఫ్తార్ విందులు మత సామరస్యాన్ని పెంపొందించడంతోపాటు ప్రజల్లో ఐక్యత, ప్రేమ, సోదరభావం ఏర్పడుతుందన్నారు. ప్రతి పండుగను ఇందరూ కలిసి మెలిసి నిర్వహించుకోవడం నగరసంస్కృతియొక్క ప్రత్యేకత అన్నారు. గంగా, జమున తహజీబ్‌కు ఇది నిదర్శనమన్నారు. బసవరాజ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తమ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సోదరభావంతో పండుగలను జరుపుకోవడం నగర ప్రజల ఆనవాయితీ పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హయత్‌భక్షీ మసీదులో ముస్లీంల ప్రార్ధనలు

**హయత్‌నగర్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** రంజాన్ నెల ఆఖరి శుక్రవారం సందర్భంగా హయత్‌నగర్‌లోని పెద్దమసీదు (హయత్‌భక్షీ మసీదు)లో ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొని ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హిందూ, ముస్లీంలు అన్ని పండుగలను కలసికట్టుగా జరుపుకోవాలన్నారు. ముస్లీంలు రంజాన్ సందర్భంగా కఠిన ఉపావాస దీక్షలు చేస్తారన్నారు. హయత్‌భక్షీ మసీదుని మరింతగా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ హయత్‌నగర్ డివిజన్ కమిటీ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, డ్యాగాల రాకేష్‌కుమార్, మహ్మద్ రఫీక్, నరహరిశెట్టి సుమంత్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలి : కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్‌లోని అనంతవేణినగర్, ఆఫీసర్స్ కాలనీలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటెన్సివ్ శానిటేషన్ ఆర్‌డబ్ల్యూఎ ఇంట్రాక్టన్ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీలలో ఉన్నటువంటి రోడ్డు సమస్యలు, డ్రైనేజ్, శానిటైజేషన్, దోమలు, వీధి దీపాలు నీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిఇ దామోదరరావు, వాటర్ వర్క్స్ మేనేజర్ వాహిని, కాలనీ అధ్యక్షులు తిరుమలేశ, బాలాజీ, బాల నరసింహ, అశోక్, లక్ష్మణ్, గట్టయ్య, చంద్రశేఖర్, ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ నరేందర్ రెడ్డి, ఎలక్ట్రిక్ సూపర్‌వైజర్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న సత్తయ్య, కౌన్సిలర్ కీర్తన తదితరులు

**తుర్కయాంజాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని డీసీసీబీ వైస్‌చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 12వ వార్డులో కౌన్సిలర్ పుల్లగుర్రం కీర్తన విజయానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సత్తయ్య కంటిపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సర్వజనుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు పథకం చేపట్టిందన్నారు. అందత్వరహిత తెలంగాణే లక్ష్యంగా ఈ కార్యక్రమం నడుస్తున్నదన్నారు. కంటి పరీక్షలు చేసి దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు వేలాది రూపాయలు ఆదా అవుతున్నాయన్నారు. అవసరమైనవారికి శస్త్ర చికిత్సలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులు సలహాలు, సూచనలు అందజేస్తున్నట్లు తెలిపారు. సిఎం కేసీఆర్ ముందుచూపుతో ఈ కార్యక్రమం చేపట్టడం గర్వకారణమన్నారు. అందరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు చెవుల దశరథ, చెవుల నరేందర్, కొంతం యాదిరెడ్డి, ఆర్ల కృష్ణ, కొల్లూరు నిరంజన్‌రెడ్డి, మేతరి శంకర్, బొద్దు శీను, బర్మల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.